క్లుప్తంగా

నేడు రాష్ట్ర స్థాయి సదస్సు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి..వాస్తవాలు, వక్రీకరణలపై నిర్వహణ

గురజాల : ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్, 123 స్వచ్ఛ పాలిటిక్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి..వాస్తవాలు, వక్రీకరణలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం జరుగుతుందని 123 స్వచ్ఛ పాలిటిక్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ బడేజానీ తెలిపారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ఎన్‌ఆర్టీఎస్ చైర్మన్ వెంకట్ మేడపాటి, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

సత్తెనపల్లి చేరుకున్న సంక్షేమ పాదయాత్ర

సత్తెనపల్లి: పరిపాలనలో సంస్కరణలను తీసుకువచ్చి పేద వర్గాలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనె లక్ష్యంతో మార్కాపురం యువకుడు షేక్ జిలాని బాషా 4,200 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని, నియోజకవర్గ పర్యటనలో ఆయనకు అండగా ఉంటామని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. జిలాని బాషా చేపట్టిన పాదయాత్ర బుధవారం సత్తెనపల్లి చేరుకున్న సందర్భంగా నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివ ప్రసాద్, నాయకులు షేక్ గని, తుమ్మల వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, రెడ్డిగూడెం కరీముల్లా పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై సురేంద్రబాబు బుధవారం తెలిపారు. ములకలూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించి అక్కడ అక్రమంగా మద్యం కలిగి ఉన్న షేక్ జానీ భాషాను అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి వద్ద పది తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నింతుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు

ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

ఎంపీడీవో హనుమారెడ్డి

యడ్లపాడు: గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఆరోగ్యశ్రీ యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిస్థాయి వివరాలను తెలుసుకుని అనారోగ్య సమస్యలు ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వై హనుమారెడ్డి చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వివరాలపై బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆరోగ్యశ్రీ పథకంపై మండల ప్రజలకు గ్రామస్థాయి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే అన్ని సేవలు ఉచితమే అన్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా గ్రామాల్లో ఏఎన్‌ఎంలు వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల పరీక్షలను చేస్తున్నారని తెలిపారు. ఆయా పరీక్షల అనంతరం ఈనెల 30 నుంచి అక్టోబర్ 16వ తేదీ జరిగే మెగా వైద్య శిబిరాలకు సంబంధించి టోకెన్లను అందజేస్తారన్నారు. టోకెన్లలో సూచించిన తేదీల ప్రకారంగా నిర్వహించే వైద్యశిబిరాలను తప్పక సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయా శిబిరాల్లో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు మరోఇద్దరు సూపర్‌స్పెషాలిటీ వైద్యులు హాజరవుతారన్నారు. అవసరమైన అన్ని రకాల పరీక్షలతో పాటు వ్యాధి సమస్యను బట్టి పెద్ద ఆస్పత్రులకు సైతం సిఫార్సు చేస్తారన్నారు.

రేపు పల్నాడు కళాక్షేత్రం ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: కళలకు కాణాచిగా పేరుపొందిన నరసరావుపేటలో పల్నాడు కళాక్షేత్రంను ఈనెల 22వ తేదిన ప్రారంభిస్తున్నట్లు కళాక్షేత్రం అడ్‌హక్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్.ఎం.భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కళల నిత్య సాధనల సమన్వయ కేంద్రంగా కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, జానపదం, ఫిల్మ్ మేకింగ్ తదితర కళలను సాధన చేసేందుకు, ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు కళాక్షేత్రం దోహదపడుతుందని స్పష్టం చేశారు. పల్నాడు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కళాక్షేత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి అట్లూరి సుభాష్ దీప్తి తదితరులు పాల్గొంటాని తెలిపారు.

అభివృద్ధి సంక్షేమమే అజెండా

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- రూ.45లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన



కేసానుపల్లిలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేసానుపల్లిలో రూ.45లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కేసానుపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని చెప్పారు. పార్టీలకు అతీతంగా ఈ గ్రామంలో పింఛన్లు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించటంతో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో మంచి పనులు చేసి వారి గుండెలో చిరకాలం ఉండాలనదే తమ అభిమతమని, రానున్న రోజుల్లో మరిన్ని మంచి పనులు చేసేందుకు శక్తివంచనలేకండా పనిచేస్తానని ఆయన తెలిపారు. కేసానుపల్లిలో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని, గ్రామంలో మంచినీటి కష్టాలను శాశ్వతంగా తొలగిస్తామని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలో విద్యార్థుల కోసం ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశామని, ఇక్కడ హైస్కూల్ ఏర్పాటు చేయటం వలన 8 గ్రామాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తెలియజేశారు.

బైపాస్ రోడ్డు పనులు పరిశీలన..

నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. రోడ్డు పనులలో నాణ్యత ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పొలాలకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు నిర్మించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మించాలని అధికారులకు ఆయన చెప్పారు. అనంతరం నారాయణపురంలో నిర్మిస్తున్న ఈద్గా, వైఎస్సార్‌సీపీ కార్యాలయం పనులను పరిశీలించారు. కేసానుపల్లిలో కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే నగదు అందజేశారు. పార్టీ ఎస్సీ సెల్ మండల శాఖ ఉపాధ్యక్షుడిగా కేసానుపల్లికి చెందిన మీసాల జేమ్స్, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడిగా ఇరికేపల్లికి చెందిన నాగెండ్ల అనిల్‌కు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, నెల్లూరి కోటేశ్వరరావు, చుండు రామారావు, ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీనులకు అండగా వైఎస్సార్ సీపీ

- కాలనీ రూపురేఖలు మార్చి అభివృద్ధి అంటే ఏమిటో చూపించాం
- రైల్వే గేట్‌పై ఫుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జిని త్వరలోనే నిర్మిస్తాం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



11వ వార్డులో లబ్ధిదారులకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఎస్సీలంటే అభిమానం చూపించే పార్టీ వైఎస్సార్‌సీపీయేనని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 11, 7 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11వ వార్డులో, సాయంత్రం 7వ వార్డులో కార్యక్రమం నిర్వహించగా ఆయా వార్డుల నుంచి మహిళలు హారతులు పడుతూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. 11 వార్డు కౌన్సిలర్ కుక్కమూడి మేరికుమారి, సుందరరావు, 7వ వార్డులో కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటిలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. 11వ వార్డులో ప్రజలు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే రెండు, మూడు బోర్లు వేయించి నీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే సీసీ రోడ్ల కోసం కావాల్సిన నిధులను వారంలో మంజూరు చేయిస్తానని, వంద శాతం సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలాగే 7వ వార్డులో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు రైల్వే అధికారులు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా గోడ నిర్మించారు. ఈ ప్రాంత ప్రజలు రోజు వారి పనుల కోసం గేటు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నందున త్వరలో రైల్వే ఫుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన నిధులు సేకరణ చేపడతామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ. 50 లక్షల నుంచి రూ.60 లక్షలు ఖర్చు అవుతుందని, సంబంధిత అధికారులతో మాట్లాడి బ్రిడ్జి 9 నెలల్లోగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలతో కాసు బ్రహ్మానందరెడ్డి ఈ కాలనీని ఎలా అయితే అభివృద్ధి చేశారో, అలాగే తాను కూడా సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అందించారు. అలాగే కాలనీ అభివృద్ధికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు తాగునీరు అందించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు వారి ఇళ్ల వద్దే అందించటం దేశంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అదేవిధంగా గురజాల నియోజకవర్గంలోని అన్ని పట్టణాలు, గ్రామాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, 11వ వార్డు కౌన్సిలర్ కుక్కమూడి మేరికుమారి, సుందరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, చల్లగుండ్ల సంతోషరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ స్వామి, పాచిమళ్ల కొండలు, మందా ప్రేమ్‌రాజు, పసుపులేటి అశోక్, కొమ్ము కల్యాణ్, అందుగుల కిరణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జన ఊరేగింపులు



శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానంలో వినాయకుడి లడ్డును దక్కించుకున్న ఆర్. నాగేశ్వరరావు



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో వినాయకుడి లడ్డూను వేలంలో దక్కించుకున్న దృశ్యం



నిమజ్జనానికి బొజ్జగణపతితో తరలివెళ్తున్న భక్తులు



దీకొండరెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ లడ్డు కైవసం చేసుకున్న యరవేద గురవారెడ్డి

కారెంపూడి: మండలంలో వాడవాడలా గణేష్ నిమజ్జనం ఊరేగింపులు బుధవారం రాత్రి వైభవంగా జరిగాయి. ముందుగా లడ్డులకు వేలం పాటలు నిర్వహించారు. అనంతరం గణేష్ బొమ్మలను ఊరేగింపుగా ప్రసాదాలు పంచుతూ గ్రామోత్సవం నిర్వహించారు. కారెంపూడిలో ఆటోనగర్, ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్, ఆదినారాయణ కాలనీ ఇంకా పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. టూ టౌన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో గణేష్ నిమజ్జన ఉత్సవ ఊరేగింపుల శోభ నెలకొంది. దాదాపు అన్ని గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

రెంటచింతలలో గణేష్ నిమజ్జనం..

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను బుధవారం పలు గ్రామాలలో మేళతాలాలతో ఊరేగింపు నిర్వహించారు. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా మహిళలు సైతం గులామ్‌లు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామాలలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామివారి లడ్డులకు వేలంపాటలను నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన 21 కేజీల స్వామివారి లడ్డును, 2 గ్రాముల బంగారు లాకెట్, స్వామివారి వెండి విగ్రహాన్ని రాచమడుగు నాగేశ్వరరావు రూ. 45,500లకు వేలంపాటలో దక్కించుకున్నారు. స్థానిక ఆటోస్టాండ్ వద్ద శ్రీ లక్ష్మి గణపతి ట్రాలీ, లారీ, కారు, యూనియన్ ఆధ్వర్యంలో 11 కేజీల లడ్డును మూఢావత్ బాలునాయక్, రాపోలు సోమయ్యలు రూ.47 వేలకు దక్కించుకున్నారు. స్థానిక ఎర్రబాలెం ఎస్టీ కాలనీలో 10 కేజీల లడ్డును మీరావత్ మునినాయక్ రూ.36 వేలకు దక్కించుకున్నారు. సత్రశాల వద్ద నున్న కృష్ణానదిలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి ఏర్పాట్లు చేశారు.

దీకొండరెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ లడ్డూ రూ.91,000

పిడుగురాళ్ల: పట్టణంలోని దీకొండరెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి లడ్డూ వేలం పాట హోరాహోరీగా సాగింది. ఎట్టకేలకు రూ.91,000లకు యరవేద గురవారెడ్డి పాడుకున్నారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జై బోలో గణేష్ మహరాజ్‌కి అంటూ నినాదాలు చేసుకుంటూ నిమజ్జనానికి తరలించారు. అలాగే పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సీఐ పీవీ ఆంజనేయులు పర్యవేక్షిస్తున్నారు.

వినాయక నిమజ్జనం

దాచేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద చైర్మన్ కలకండ ఆంధ్రయ్య, కార్యదర్శి నూనె శ్రీనివాసరావు, మిర్చి ఎగుమతి, దిగుమతులు చేసే వ్యాపారులు, కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన వేలంలో లడ్డూను రూ.22,116లకు కె.కె.చిల్లీస్ ట్రేడర్ నిర్వాహకులు చిట్టిప్రోలు నరసింహారావు దక్కించుకున్నారు.



కారెంపూడిలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు



కారెంపూడిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు



పట్టణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పీవీఆర్ ప్రత్యేక పూజలు..



అన్నదానం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్

మాచర్ల: పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో వినాయకుని గుడి వద్ద 3వ రోజు బుధవారం మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ కాలనీకి చెందిన పలువురు నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

అన్నదానం, నిమజ్జనం

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఆటోస్టాండ్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ఆప్పి శ్రీను ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారికి 3వ రోజు ఊరేగింపు నిర్వహించి, జేజేలు పలుకుతూ నిమజ్జనానికి తరలించారు.

వ్యాపారికి బురిడీ

ఫోన్ పే నుంచి లక్ష నగదు బదిలీ చేసుకున్న ఆగంతకుడు



బాధితుడు లక్ష్మీనారాయణ

దాచేపల్లి : బట్టల దుకాణం నిర్వాహకుడిని ఆగంతకుడు బురిడీ కొట్టించాడు. కొనుగోలు చేసిన లుంగీలకు ఫోన్ పే చేస్తామని నమ్మించిన ఆగంతకుడు దుకాణ యజమాని సెల్‌ఫోన్ తీసుకుని ఫోన్ పే ద్వారా తన అకౌంట్‌కు లక్ష నగదు బదిలీ చేశాడు. మోసపోయానని తెలుసుకున్న దుకాణ నిర్వాహకుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దేవరశెట్టి లక్ష్మీనారాయణ దాచేపల్లిలో బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. మండల పరిధిలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వచ్చిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలు దాచేపల్లిలోని లక్ష్మీనారాయణ దుకాణంకు వచ్చి లుంగీలు చూపించాలని కోరారు. 10 లుంగీలు కొనుగోలు చేసిన తరువాత తన ఫోన్ పే యాప్ సక్రమంగా పనిచేయటం లేదని, మీ సెల్‌ఫోన్ ఇస్తే ఫోన్ పే పని చేస్తుందో లేదో చూస్తానని నమ్మించాడు. లక్ష్మీనారాయణ ఫోన్ తీసుకున్న ఆగంతకుడు ఫోన్ పే పాస్‌వర్డ్ తెలుసుకుని తన అకౌంట్‌కు లక్ష నగదును జమ చేసుకున్నాడు. ఆ తరువాత తనకు పని ఉందని చెప్పి అక్కడ నుంచి ఉడాయించాడు. ఫోన్ పే ద్వారా లక్ష నగదు బదిలీ అయినట్లు మెసేజ్ రావటంతో లక్ష్మీనారాయణ ఖంగుతిన్నాడు. ఆగంతకుడు చేసిన మోసంను లక్ష్మీనారాయణ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్‌కు కూడా ఫిర్యాదు చేశాడు. ఆగంతకుడి అడ్రస్ సేకరించిన పోలీసులు బ్యాంక్ లావాదేవీలు నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని సీఐ సురేంద్రబాబు చెప్పారు.

టెన్త్, ఇంటర్ డ్రాప్‌అవుట్లను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వివిధ కారణాలతో చదువును మధ్యలో మానేసిన పదో తరగతి, ఇంటర్ పూర్తి చేయని వారిని వలంటీర్ల సహకారంతో గుర్తించి టెన్త్, ఇంటర్‌లో వారికి అడ్మిషన్లు కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు కోరారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు ఏపీఓఎస్‌ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ మాట్లాడుతూ ఈ సువర్ణ అవకాశాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదువు మధ్యలో ఆపేసిన వారు వినియోగించుకోవాలని కోరారు. పల్నాడు ఏపీ ఓఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కేఎం హుసేన్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌కి సంబంధించిన కోర్సులు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. అక్కడ కూడా అడ్మిషన్ ఇప్పించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఏ రాఘవేంద్రరావు, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఏ మాధవీలత, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఈ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చింతలచెర్వు సెక్టారు పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజకుమారి పాల్గొని గర్భిణులు, కిషోర బాలికలు, బాలింతలు తీసుకోవాలని పౌష్టికాహారాన్ని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న బాలామృతం, పాలు, గుడ్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జె.శ్రీదేవి, ఎస్‌కే. మౌలాబీ, కె. పరిశుద్ధం, జె. తిరుపతమ్మ, ఎం. రంగలక్ష్మి, ఈ. ఈశ్వరమ్మ, ఎం .అచ్చమ్మ, ఎంఎస్‌కే జ్యోతిర్మయి, ఎం.ఎల్ఎం మేరివాణి, ఏఎన్‌ఎం రవణ, ఆశ వర్కర్ జి.అనురాధ, మహిళలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



పలుదేవర్లపాడులో రీసర్వే ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎం.భవానీశంకర్

పలుదేవర్లపాడు(ముప్పాళ్ల): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ కోరారు. మండలంలోని పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో చేపట్టిన రీసర్వే ప్రక్రియను బుధవారం పరిశీలించారు. మొదటి విడతగా ఆరు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ ప్రారంభమైందని, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించాలని కోరారు. వందేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే ప్రక్రియను చేపట్టిందని వివరించారు. సర్వే ఆఫ్ ఇండియా జాతీయ సంస్థ సహకారంతో ఆధునిక విధానంలో సర్వే జరుగుతుందని చెప్పారు. సర్వే జరిగే ప్రాంతంలోని రైతులకు మూడు రోజులు ముందుగానే నోటీసులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఈపూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల హెచ్‌ఎం ఎస్.రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ తుర్లపాటి చౌదయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.అంకుల్ ప్రారంభించారు. పోటీల్లో ఈపూరు, ముప్పాళ్ల, ఇనిమెళ్ల, కొచ్చర్ల, కొండ్రముట్ల, బొగ్గరం జెడ్పీహెచ్ పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ నుంచి బాలబాలికలు హాజరయ్యారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా తదితర క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. జెడ్పీటీసీ చౌదయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడి మరిన్ని విజయాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఆటల పోటీల సందర్భంగా ఈపూరు పాఠశాలకు చెందిన క్రీడాకారులకు ఉపాధ్యాయులు డి.సుబ్రహ్మణ్యం, వి.అనురాధ, ఏపీటీఎఫ్ యూనియన్ 1104 ఎన్‌ఆర్‌టీ అధ్యక్ష, కార్యదర్శులు, అంగలూరు సొసైటీ సిబ్బంది జి. శేఖర్ క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమాల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.వీరాంజనేయులు పాల్గొన్నారు.

హోంగార్డు నాగరాజానాయక్ సస్పెన్షన్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నాగరాజానాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రవిశంకర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్పీ బి.ఆదినారాయణ తెలిపారు. హోంగార్డు నాయక్ సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి పోలీసులు దాడులు గురించి ముందస్తుగా సమాచారం చేరవేస్తున్నందుకు ఆయన పై క్రమశిక్షణ చర్యలు తీసుకునే క్రమంలో సస్పెండ్ చేసినట్లు వివరించారు.

గొర్రె పిల్లల అపహరణ

నకరికల్లు: గొర్రె పిల్లల అపహరణపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎ.బాలకృష్ణ అందించిన వివరాలు.. తెలంగాణకు చెందిన మోదీపురం చిన అప్పారావు, మరికొందరు కలసి గొర్రెలు మేపుకునేందుకు మండలంలోని కుంకలగుంట గ్రామంలోని పొలాలకు వచ్చారు. 19వ తేదీ రాత్రి చుట్టూ ఇనుపజల్లెడ ఏర్పాటు చేసి వాటి మధ్యలో గొర్రెపిల్లలను ఉంచి, తెల్లవారిన తరువాత చూస్తే ఐదుగురికి చెందిన 17 గొర్రెపిల్లలు కన్పించడం లేదు. దీంతో అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.